నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 21 జూన్ 2024 | HYDERABAD

విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం

11.77 లక్షల మంది పిల్లలకు

నట్టల మందు

ఈనెల 27 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమం

మంత్రి పొన్నం ప్రభాకర్

ఖైరతాబాద్, జూన్ 20 : రాష్ట్ర వ్యాప్తంగా 11.77లక్షల మంది పిల్లలకు నట్టల మందు పంపిణీ చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమాజిగూడలోని రాజ్‌భవన్ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి నట్టల మందు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 95 లక్షల అల్బెండజోల్ మాత్రలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ నెల 27 వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, రాజ్‌భవన్ కార్యదర్శి బుర్రా వెంకటేశం, మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టీనా చోంగ్తూ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ నాయకులు మహేశ్ యాదవ్, నరేశ్ పాల్గొన్నారు.

జూలై 15 నుంచి తెలుగు పరిచయ కోర్సు తరగతులు

హిమాయత్‌నగర్, జూన్ 20: తెలుగురాని ప్రభుత్వ, ప్రభుత్వేతర ఉద్యోగుల కోసం తెలుగు అకాడమీ పరిచయ కోర్సును అందిస్తోంది. జూలై 15వ తేదీ నుంచి ఈ కోర్సు తరగతులు ప్రారంభమవుతాయని తెలుగు అకాడమీ సంచాలకులు శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికార భాషగా తెలుగును అమలు పరిచే ప్రభుత్వ విధానంలో భాగంగా 48 రోజుల పాటు పనిదినాలలో సాయంత్రం 5:30 నుంచి రాత్రి 7:30 వరకు శిక్షణ ఉంటుందని, ఈ పరిచయ కోర్సులో ప్రవేశానికి కనీస విద్యార్హత 10వ తరగతి కాగా ఆసక్తి ఉన్న వారు జూలై 6లోపు హిమాయత్‌నగర్‌లోని తెలుగు అకాడమీని సంప్రదించి దరఖాస్తు ఫారాలను తీసుకోవాలన్నారు. కోర్సు పూర్తయ్యే నాటికి తెలుగులో మాట్లాడడం, రాయడం, చదవడం నేర్పిస్తామన్నారు. వివరాల కోసం 9966230473, 8886801239 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్ చౌరస్తాలోని ఎస్వీఐటీ కళాశాల అడిటోరియంలో గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ దశదిన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు హాజరై.. శంకర్ యాదవ్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. -మారేడ్‌పల్లి, జూన్ 20

పట్టపగలే కత్తిపోట్లు.. దోపిడీకి యత్నం

నగల దుకాణంలో చొరబడిన దుండగులు

యజమానిపై కత్తితో దాడి

బాధితుడి సమయస్ఫూర్తితో పరారీ

మేడ్చల్ పీఎస్‌కు కూతవేటు దూరంలో ఘటన

మేడ్చల్, జూన్ 20 : మేడ్చల్‌లో పట్టపగలు దోపిడీ యత్నం జరిగింది. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న నగలు దుకాణంలో చోరీకి యత్నించారు. దుకాణదారుడిపై కత్తితో దాడికి తెగబడి, బంగారు, వెండి నగలు దోచుకోవాలని పన్నాగం పన్నారు. అయితే యజమాని చూపిన సమయస్ఫూర్తి, ధైర్యం కారణంగా దుండగలు పరారయ్యారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం...మేడ్చల్ పట్టణంలోని ఆవల జగదాంబా జ్యువెల్రీ దుకాణంలో గురువారం మధ్యాహ్నం ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చారు. ఓ వ్యక్తి బురఖా వేసుకోగ, మరొకరు హెల్మెట్ ధరించి ఉన్నాడు. ఆ ఇద్దరు నేరుగా నగల దుకాణంలోకి వచ్చారు. బురఖా వేసుకున్న వ్యక్తి యజమాని శేషారాంను బంగారం, వెండి నగలు ఇవ్వాలంటూ బెదిరించాడు. కుడివైపు చాతీపై పొడిచాడు. భయాందోళనకు గురైన యజమాని కొడుకు సురేశ్ దుకాణం లోపలికి వెళ్లి, తలుపువేసుకుని దాక్కున్నాడు. దుండగులు తమ వెంట తెచ్చుకున్న బ్యాగులో నగలు వేయాలంటూ బెదిరిస్తుంటే..' మీరే తీసుకోండి' అంటూ శేషారాం చేతులెత్తేశాడు. హెల్మెట్ పెట్టుకున్న వ్యక్తి నగలను బ్యాగులో వేసే ప్రయత్నం చేస్తుండగా, దుండగుడి దాడిలో గాయపడ్డ శేషారాం వారి నుంచి తప్పించుకొని బయటికి వచ్చి చోర్ చోర్ అంటూ అరిచాడు. అతడిని అనుసరించిన దుండగలు భయపడి బైక్ స్టార్ట్ చేసుకొని పారిపోయారు. ఇదే సమయంలో శేషారాం కుమారుడు సురేశ్ కుర్చీని వాహనం వెనుకాల కూర్చున్న వ్యక్తిపై విసిరాడు. అంతలోనే దుండుగులు పారిపోయారు. పోలీసులు చేరుకొని.. గాయపడిన శేషారాంను ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉంది. కాగా, పట్టపగలే నగల దుకాణదారుడిపై కత్తితో దాడి చేసి, దొంగతనానికి యత్నించిన ఘటన సంచలనంగా మారింది. ఇందుకు సంబంధించిన సీసీ పుటేజీ బయటికి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఘటనా స్థలాన్ని డీసీపీ నితిక పంత్, అడిషనల్ డీసీపీ నర్సింహ రెడ్డి సందర్శించారు. నిందితులు హిందీ మాట్లాడారని, వారు ఉత్తర భారతదేశానికి చెందిన వారిగా భావిస్తున్నామన్నారు.

నగల దుకాణం యజమాని శేషారాంను కత్తితో బెదిరిస్తున్న దుండగుడు

బైక్‌పై పారిపోతున్న దుండగులు

ఆర్థిక నేరాల కట్టడికి.. 'ఈవోడబ్ల్యూ'

రెండు నెలల్లో 20 కేసులు నమోదు

సిటీబ్యూరో: ఆర్థిక నేరాల కట్టడికి సైబరాబాద్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే సైబరాబాద్ కమిషనరేట్‌లో ప్రత్యేకంగా ఈవోడబ్ల్యూ (ఆర్థిక నేరాల విభాగం) ఠాణా ఏర్పాటైంది. గతంలో ఏవైనా ఆర్థిక నేరాలు జరిగితే స్థానిక ఠాణాల్లో కేసులు నమోదు అయ్యేవి. పెద్ద కేసులు మాత్రమే క్రైమ్ విభాగం పరిధిలోని ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ అయ్యేవి. కానీ ఇప్పుడు ఇతర విభాగాల మాదిరిగానే ఆర్థిక నేరాలకు సంబంధించి ప్రత్యేకంగా ఈవోడబ్ల్యూ విభాగాన్ని ఏర్పాటు చేయగా, డీసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఈ విభాగం పనిచేస్తుంది. నలుగురు ఏసీపీలు, ఐదుగురు ఇన్‌స్పెక్టర్ల చొప్పున మొత్తం 9 మంది అధికారులు ఈ విభాగంలో ఆర్థిక నేరాల దర్యాప్తు, నేరాల నియంత్రణ తదితర అంశాలపై పనిచేస్తున్నారు. రూ.3 కోట్లు లేదా ఆపై జరిగే ఆర్థిక నేరాలన్నీ ఈవోడబ్ల్యూ ఠాణాకు బదిలీ అవుతాయి. బాధితులు నేరుగా వచ్చి కూడా ఈవోడబ్ల్యూ ఠాణాలో ఫిర్యాదు చేయవచ్చు.

ఆర్థిక నేరాలు తగ్గించేందుకే..

అవినాశ్ మహంతి, సైబరాబాద్ సీపీ

ప్రస్తుతం ఆర్థిక, సైబర్‌క్రైమ్ మోసాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని బాధితులకు సత్వర న్యాయం జరగాలనే ఉద్దేశంతో సైబరాబాద్ కమిషనరేట్‌కు ప్రత్యేకంగా ఈవోడబ్ల్యూ ఠాణాను ఏర్పాటు చేశాం. దీని వల్ల ఆర్థిక నేరాలకు గురైన బాధితులు ఇక నుంచి నేరుగా ఈ ఠాణాలో ఫిర్యాదు చేయవచ్చు.

రెండు నెలల్లో 20 కేసులు

ప్రసాద్, డీసీపీ(ఈవోడబ్ల్యూ)

ఈవోడబ్ల్యూ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 20 కేసులు నమోదు చేశాం. అంతకు ముందు 22 కేసులు నమాదయ్యాయి. దాదాపు అన్ని కేసుల్లో దర్యాప్తు జరిపి నిందితులను అరెస్టు చేశాం. ఈ మధ్య ఎక్కువగా ఫ్రీ లాంచింగ్ ఆఫర్ పేరుతో కొన్ని ముఠాలు అమాయక ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి బోర్డు తిప్పేస్తున్నాయి. భారతి బిల్డర్స్, సాహితీ ఇన్‌ఫ్రా, సీహ్వా, ఇస్తరా పార్క్ ప్రైలి వంటి కేసుల్లో బాధితులు కోట్ల రూపాయలు మోసపోయారు. నిందితులను అరెస్టు చేశాం.

పిలిచి..కత్తులతో పొడిచి

ఆసిఫ్‌నగర్‌లో రౌడీషీటర్ దారుణ హత్య

మెహిదీపట్నం జూన్ 20: ఓ రౌడీషీటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వెలుగుచూసింది. వారం రోజుల వ్యవధిలో ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు హత్యలు జరగడం కలకలం రేపింది. దక్షిణ, పశ్చిమ మండలం అదనపు డీసీపీ అష్వాక్ అహ్మద్ కథనం ప్రకారం.....మల్లేపల్లి ఆగాపురాలో నివసించే అలీం(34) పూల అలంకరణ వ్యాపారం చేస్తూ జీవించే వాడు. ఇతడిపై హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీట్ ఉంది. ఇదిలా ఉండగా, స్నేహితుడు ఒమర్‌తో అలీంకు తరచూ గొడవలు జరిగేవి. తాగిన మైకంలో అనేకసార్లు అలీం, ఒమర్‌ను 'నీ అంతు చూస్తా' అంటూ బెదిరించేవాడు. దీనిని మనసులో పెట్టుకున్న ఒమర్ తన స్నేహితులు సిరాజ్, గౌస్, పాషాలతో కలిసి అలీంను చంపాలని నిర్ణయించుకున్నాడు. బుధవారం అర్ధరాత్రి మల్లేపల్లి నోబుల్ టాకీస్ చౌరస్తా సమీపంలోని ఫీల్‌ఖానా రోడ్‌లో అలీంను పిలిచి ప్లాన్ ప్రకారం.. కత్తులతో పొడిచి హత్య చేసి పారిపోయారు. సమాచారం అందుకున్న ఆసిఫ్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అలీం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసును ఆసిఫ్‌నగర్ ఏసీపీ కిషన్‌కుమార్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే వారం రోజుల వ్యవధిలో ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు 200 మీటర్ల దూరంలోనే రెండు హత్యలు జరగడం కలకలం రేపుతున్నది.

అల్ఫా హోటల్‌లో.. పాడైన మటన్‌తో బిర్యానీ

అపరిశుభ్రంగా వంట గది

నాసిరకం ఆహార పదార్థాలతో ఫుడ్ తయారీ

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో గుర్తింపు

హోటల్ నిర్వాహకులకు లక్ష జరిమానా

సిటీబ్యూరో, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లోని రెస్టారెంట్లు, హోటళ్లు ధనార్జనే ధ్యేయంగా.. నాణ్యతకు తిలోదకాలు ఇస్తూ..ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. కుళ్లిపోయిన మాంసం, గడువు దాటిన పదార్థాలు, కల్తీ మసాలాలు వాడటమే కాకుండా అపరిశుభ్ర వాతావరణంలో ఆహారాన్ని సిద్ధం చేస్తున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో తేలుతోంది. గడిచిన కొన్ని రోజులుగా గ్రేటర్ వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్న ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగానే తాజాగా సికింద్రాబాద్ అల్ఫా హోటల్‌లో తనిఖీ చేశారు. ఈ హోటల్‌లో పాడైన మటన్‌తో బిర్యానీ తయారు చేస్తున్నట్లు నిర్ధారించారు. ఇక వంట గది అపరిశుభ్రంగా ఉండటం, నాసిరకంగా ఆహార పదార్థాలు ఉండటాన్ని గుర్తించారు. ఎప్పుడో తయారైన ఫుడ్‌ను ఫ్రిజ్‌లో పెట్టి కస్టమర్లకు అందిస్తున్నట్లు కనుగొన్నారు. తెరిచి ఉన్న డస్ట్‌బిన్లు, సీలింగ్‌పై ప్లాస్టరింగ్ వంటి అపరిశుభ్ర పరిస్థితులను గుర్తించారు. ఐస్ క్రీమ్, బ్రెడ్ ప్యాకెట్లు తయారు తేదీ, టీ పొడి, బ్యాచ్ నంబర్లు లేకుండా ఉన్నాయి. దీంతో అల్ఫా హోటల్ నిర్వాహకులకు ఫుడ్ సేఫ్టీ అధికారులు రూ. లక్ష జరిమానా విధించారు. హోటల్ సందర్శనిలో పరోటా ప్యాకెట్లు, నూడుల్స్ ప్యాకెట్లను , బెల్లం క్యూబ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అపరిశుభ్రమైన వాతావరణంలో కిచెన్ ఉన్నదని గుర్తించారు. సికింద్రాబాద్‌లో రాజ్ బార్ అండ్ రెస్టారెంట్‌లో డస్ట్‌బిన్ ప్రాంతానికి సమీపంలో ఎలుకను గమనించారు. ఎలుకల ఉచ్చులు ఏర్పాటు చేయలేదు. వంటగదిలో సింథటిక్ ఫుడ్ కలర్‌ను గుర్తించారు. డస్ట్‌బిన్‌లకు మూతలు లేవు. సిబ్బందికి హెయిర్ క్యాప్‌లు లేకుండా ఉన్నారు. కిచెన్ అపరిశుభ్రంగా, దుమ్ముతో నిండిపోయినట్లు గుర్తించారు. సంబంధిత నిర్వాహకులపై ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఆలుగడ్డబావి వద్ద రెండు స్పేర్ కోచ్‌ల్లో మంటలు చెలరేగి.. పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని.. మంటలను అదుపు చేశారు. -మారేడ్‌పల్లి, జూన్ 20

ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద పంపింగ్ పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

7 పంపులు.. 168 ఎంజీడీలు

ఎల్లంపల్లిలో ఎమర్జెన్సీ పంపింగ్ పనులు షురూ

పరిశీలించిన జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి

సిటీబ్యూరో, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : ఎల్లంపల్లి ప్రాజెక్టులో మూర్మూర్ వద్ద ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ పంపింగ్ పనులను ఎండీ సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. గురువారం జలమండలి అధికారులతో కలిసి ప్రాజెక్టుకు వెళ్లి పంపింగ్ పనులు పరిశీలించారు. హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలుగా పంపింగ్ ప్రారంభించామని ఎండీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. 20 పంపులు ఏర్పాటు చేశామని , ప్రస్తుతం 7 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నట్లు వెల్లడించారు. అవసరాన్ని నీటి లభ్యతను బట్టి మిగిలిన పంపులను కూడా దశల వారీగా ప్రారంభిస్తామన్నారు. గోదావరి పథకం ద్వారా నగరానికి 168 ఎంజీడీల నీరు తరలించనున్నట్లు వివరించారు.

నీటి కొరత రాకుండా..

వర్షపాతం తక్కువ నమోదు కావడంతో ఎగువ ఉన్న కడెం ప్రాజెక్టు నుంచి ఎలాంటి వరద లేదు. దీంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం క్రమంగా తగ్గడం ప్రారంభమైంది. ఇలాగే కొనసాగితే హైదరాబాద్ నగరానికి గోదావరి డ్రికింగ్ వాటర్ సప్లయి పథకం ద్వారా అందించే నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడతాయి. దీంతో ముందు జాగ్రత్త చర్యగా ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు.

కీలక ప్రాంతాలకు నీటి సరఫరా

ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో ఎక్కువ నీరు ఉంటే గ్రావిటీ ద్వారా మూర్మూర్‌లోని పంప్‌హౌజ్‌కు తీసుకొచ్చి అక్కడి నుంచి పంపింగ్ ద్వారా సిద్దిపేట్ దగ్గరలోని మల్లారం పంప్‌హౌజ్‌కు తరలిస్తారు. తర్వాత అక్కడి నుంచి నగరానికి సరఫరా చేస్తున్నారు. కానీ ఇప్పుడు నీటి మట్టం తగ్గిపోవడంతో ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటి తరలింపునకు ఏర్పాట్లు చేశారు. ఐటీ కారిడార్ పరిధిలోని మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, హైటెక్‌సిటీ, లింగంపల్లి, మియాపూర్, చందానగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, కుత్బుల్లాపూర్, అల్వాల్, మల్కాజిగిరి తదితర ప్రాంతాలకు గోదావరి జలాల ద్వారానే నీరు అందిస్తున్నారు.

ఎనిమిదేండ్ల విరామం తర్వాత

దాదాపు ఎనిమిదేండ్ల తర్వాత ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. 2016లో ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటిని ఎత్తిపోసి హైదరాబాద్‌కు తరలించారు. మరోవైపు నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో ఎమర్జెన్సీ పంపింగ్ ఏర్పాటు చేసి నీటిని తరలిస్తున్నారు. ఎమర్జెన్సీ పంపింగ్ పనులు పరిశీలించిన తర్వాత ఈ పర్యటనలో ఎండీ సుదర్శన్‌రెడ్డి మూర్మూర్‌లోని గోదావరి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు పంప్‌హౌజ్‌ను సందర్శించి స్కాడా రూం రికార్డులను పరిశీలించారు. తర్వాత మల్లారంలోని నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ నీటి శుద్ధి జరిగే ప్రక్రియ, నీటి పరీక్షల వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో కొత్త నీరు చేరే అవకాశం ఉన్నందున ఆ సమయంలో గంటకు ఒకసారి శాంపిల్ తీసి టెస్ట్ చేయాలని ఎండీ సూచించారు.

మారేడ్‌పల్లి తహసీల్దార్ సస్పెండ్

గిర్దావర్, రికార్డు అసిస్టెంట్ సైతం..

సిటీబ్యూరో, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : మారేడ్‌పల్లి తహసీల్దార్ పద్మ సుందరిపై వేటు పడింది. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో కలెక్టర్ ఆమెను సస్పెండ్ చేశారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం మారేడ్‌పల్లి ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో తహసీల్దార్ అందుబాటులో లేరు. వివిధ సేవల కోసం వచ్చిన ప్రజలు ఆరు బయట తహసీల్దార్ కోసం ఎదురుచూస్తున్నారు. అక్కడున్న అధికారులను అడిగినా తమకు తెలియదని చెప్పారు. రికార్డు రిజిస్టర్లు సైతం గందరగోళంగా ఉన్నాయి. మారేడ్‌పల్లిలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములు వందల ఎకరాల్లో ఉన్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన శత్రు భూములు ఉన్నాయి. అందులో చాలా భూములు కోర్టు కేసుల్లో ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఉన్నతాధికారులకు రిపోర్ట్ ఇస్తుండాలి. కానీ తహసీల్దార్ ఈ రికార్డుల పర్యవేక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలు వచ్చాయి. మరోవైపు వివిధ సేవల కోసం వచ్చిన ప్రజలను సైతం నిర్ణీత సమయంలో పనులు చేయకుండా తిప్పలు పెట్టారు. ఈ వ్యవహారంపై ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో కలెక్టర్ ఆకస్మిక పర్యటన చేసి పలు రికార్డులను పరిశీలించడంతో పాటు అక్కడి వ్యవహారాన్ని తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్‌తో పాటు గిర్దావర్ పి.ప్రసన్న లక్ష్మి, రికార్డు అసిస్టెంట్ ఎస్.రవిలను సైతం సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

తహసీల్దార్ పద్మ సుందరి నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

'ఫేస్ రికగ్నిషన్'లో లోపాలు సరిదిద్దాం

అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్

సిటీబ్యూరో : జీహెచ్ఎంసీ పరిధిలోని పారిశుధ్య కార్మికుల హాజరు నమోదు ప్రకారంగా వేతనాల చెల్లింపునకు అమలు చేస్తున్న ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ ప్రక్రియను అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. గురువారం దోమలగూడ ఏరియా ఏవీ కాలేజీ వద్ద కవాడిగూడ ఎస్ఎఫ్ఏ పరిధిలో శానిటేషన్ బృందాల హాజరు నమోదుపై ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో చేస్తున్న హాజరు విధానాన్ని పరిశీలించారు. ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో లోపాలను సరిదిద్దామని, లైవ్ ఇమేజ్‌తో రెండు నుంచి మూడు సెకండ్లలో ఫొటో క్యాప్చర్‌తో హాజరు నమోదు అవుతున్నదని, కండ్లు బ్లింక్ చేయకుండా ఫొటో క్యాప్చర్ కాదని స్నేహ శబరీష్ చెప్పారు. బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టంకు ప్రతి సంవత్సరం రూ.2కోట్ల మేర ఖర్చు పెట్టగా, తాజాగా అమలు చేస్తున్న ఫేస్ రికగ్నిషన్ సిస్టంకు రూ.64.50లక్షల ఖర్చు మాత్రమే అవుతుందని వివరించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 16,978 మంది శానిటేషన్ వర్కర్లు రోజువారీ అటెండెన్స్ నమోదు అవుతుందని, జూన్ 14న గూగుల్ ప్లే స్టోర్‌లో ఏఐఓఎస్ యాన్‌ను ఆపివేయడంతో టెక్నికల్ ప్రాబ్లమ్ వచ్చిందన్నారు. శానిటేషన్ కార్మికులకు ఆధార్ బయోమెట్రిక్‌తో నెలవారీ వేతనాలకు రూ.33.5కోట్లు ఖర్చు అవుతుందని, ఫేస్ రికగ్నిషన్‌తో రూ.31 కోట్ల ఖర్చయ్యే అవకాశం ఉందన్నారు.

వచ్చే వారంలో భారీ వర్షాలు

సిటీబ్యూరో, జూన్ 20 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉక్కబోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎండలు కూడా దంచికొడుతున్నాయి. అయితే నగరంలో ఉష్ణోగ్రతలు పెరగడానికి ప్రధాన కారణం మాన్‌సూన్ వీక్‌గా ఉండటం, రాష్ట్రంలో రుతుపవనాలు పూర్తిస్థాయిలో విస్తరించకపోవడమేనని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి శ్రావణి స్పష్టం చేశారు. వచ్చే వారంలో మోస్తరు నుంచి భారీ, భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వెల్లడించారు.